## రామయ్యకు నిత్య కల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

భద్రాచలం, అక్టోబర్ 12: భద్రాచలంలోని సీతారామచంద్రస్వామికి అర్చకులు గురువారం నిత్య కల్యాణం నిర్వహించారు. భక్తులకు శేష వస్త్రాలు, ప్రసాదాలు అందించారు. స్వామి వారిని పరమేశ్వరానంద గిరి స్వామీజీ దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ ఈవో ఎల్.రమాదేవి, వేద పండితులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. స్వామి వారికి స్వామీజీ ప్రత్యేక పూజలు చేశారు. ఆయనకు లక్ష్మీతాయారమ్మ సన్నిధిలో పండితులు వేద ఆశీర్వచనం, ప్రసాదాలు, శేష వస్త్రాలు అందజేశారు.

## బడిలో బతుకమ్మ వేడుక

భద్రాచలం, అక్టోబర్ 12: స్థానిక లిటిల్ ఫ్లవర్స్ విద్యాసంస్థల ప్రాంగణంలో గురువారం ముందస్తుగా బతుకమ్మ పండుగను విద్యార్థులు, ఉపాధ్యాయులు జరుపుకున్నారు. ఈ 13వ తేదీ నుంచి దసరా సెలవులు ఉండడంతో ముందు రోజున ఇలా వేడుక చేసుకున్నారు. లిటిల్ ఫ్లవర్స్ విద్యాసంస్థల డైరెక్టర్లు మాగంటి రమేష్‌బాబు, ప్రసాదబాబు పాల్గొన్నారు.

## ప్రైవేట్ ఆసుపత్రిలో మహిళ మృతి

భద్రాచలం, అక్టోబర్ 12: పట్టణంలోని బస్టాండ్ వెనుక ఉన్న ప్రైవేట్ ఆసుపత్రిలో గురువారం మహిళ మృతిచెందింది. ఏపీలోని ఎటపాక మండలం గన్నవరం గ్రామానికి చెందిన ఆమె కుటుంబీకులు తెలిపిన వివరాలు.. థైరాయిడ్‌తో బాధపడుతున్న మహిళను ఆమె కుటుంబీకులు ఆసుపత్రికి తీసుకొచ్చారు. ఆమెకు వైద్యులు ఆపరేషన్ చేశారు. ఆ తర్వాత ఆమె అక్కడే మృతిచెందింది. ఆమె కుటుంబీకులకు సిబ్బంది ఈ విషయం చెప్పి, ఆపరేషన్ ఫీజ్ కట్టిన తర్వాతనే మృతదేహాన్ని తీసుకెళ్లాలని అన్నారు. దీంతో ఆమె కుటుంబీకులు అవాక్కయ్యారు. వైద్యుల నిర్లక్ష్యం ఫలితంగానే మృతి చెందిందని ఆరోపిస్తూ వారు ఆసుపత్రి వద్ద ఆందోళనకు దిగారు. గన్నవరం గ్రామ పెద్దలను ఆసుపత్రి నిర్వాహకులు పిలిపించారు. వారి ద్వారా మృతురాలి కుటుంబీకులతో రాజీ కుదుర్చుకున్నారు. ఆస్పత్రి నిర్వాహకులే అంబులెన్సులో మహిళ మృతదేహాన్ని గన్నవరం తరలించారు.

## భారీ కొండచిలువ పట్టివేత



పట్టుబడిన భారీ కొండచిలువ

చర్ల, అక్టోబర్ 12: మండలంలోని కలివేరు గ్రామంలోగల సీఆర్‌పీఎఫ్-151 క్యాంపులోకి గురువారం భారీ కొండచిలువ వచ్చింది. అది దాదాపుగా ఎనిమిది అడుగుల పొడవు ఉంది. దానిని జవాన్లు బంధించి, అటవీ అధికారులకు సమాచారమిచ్చారు. దానిని డీఆర్‌వో హచ్చా, సిబ్బంది కలిసి స్వాధీనపర్చుకుని, సుబ్బంపేట అడవుల్లో వదిలారు.

## దసరా ఉత్సవాల ప్రచార రథం ప్రారంభం



ప్రచారం రథాన్ని ప్రారంభిస్తున్న ఈవో, కమిటీ చైర్మన్

పాల్వంచ రూరల్, అక్టోబర్ 12: మండలంలోని పెద్దమ్మ తల్లి గుడిలో ఈ నెల 15 నుంచి 24వ తేదీ వరకు దసరా ఉత్సవాలు జరుగనున్నాయి. వీటికి ప్రాచుర్యం కల్పించేందుకు గురువారం ప్రచార రథాన్ని ఆలయ ప్రాంగణంలో ఈవో రజనీకుమారి, ఆలయ కమిటీ చైర్మన్ మహీపతి రామలింగం ప్రారంభించారు. కార్యక్రమంలో ధర్మకర్తలు ఆచార్యులు, నాగరాజు, శ్రీనివాసరెడ్డి, లక్ష్మినారాయణ, చిన వెంకటేశ్వర్లు, సువాలీ, వెంగళరావు, విజయ్‌కుమార్, రామారావు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రాథమిక వైద్యం మాత్రమే చేయాలి





మాట్లాడుతున్న డాక్టర్ రాజ్‌కుమార్
హాజరైన ఆర్‌ఎంపీ/పీఎంపీలతో

చర్ల, అక్టోబర్ 12: ఆర్‌ఎంపీలు, పీఎంపీలు ప్రాథమిక వైద్యం మాత్రమే చేయాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ రాజ్‌కుమార్ అన్నారు. వారితో ఆయన గురువారం మండలంలోని కొయ్యూరు (చర్ల) ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సమావేశమయ్యారు. అర్హతకు మించిన వైద్యం చేస్తుండడంతో అనేక సమస్యలు వస్తున్నాయని అన్నారు. సాధారణ జ్వరంతో వచ్చిన వారిని డెంగీ సోకినట్లుగా కొందరు భయపెడుతున్నట్లుగా తమ దృష్టికి వచ్చిందని చెప్పారు. అర్హతగల ఆర్‌ఎంపీలకు ప్రభుత్వపరంగా శిక్షణ ఇచ్చే అలోచన ఉందన్నారు. చర్ల (కొయ్యూరు) పీహెచ్‌సీ డాక్టర్ శ్రీధర్, సత్యనారాయణపురం పీహెచ్‌సీ డాక్టర్ దివ్యనయన, డీపీఎంవోలు చింతా సత్యనారాయణ, ఆడెపు ముత్యాలరావు పాల్గొన్నారు.

# పోలీస్ అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన పూర్తి

కొత్తగూడెం క్రైం, అక్టోబర్ 12: రాష్ట్ర స్థాయి పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డ్ (టీఎస్ఎల్‌పీఆర్‌బీ) ఆధ్వర్యంలో జరిగిన కానిస్టేబుల్ ఉద్యోగాల భర్తీలో భాగంగా ఎంపికైన అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన గురువారంతో పూర్తయింది. ఎస్పీ కార్యాలయ ఆవరణలో పోలీస్ అధికారులు ఈ ప్రక్రియ నిర్వహించారు. టీఎస్ఎస్పీ, ఏఆర్, సివిల్ విభాగాలలో జిల్లా వ్యాప్తంగా 298మంది అభ్యర్థుల ఎంపిక పూర్తయినట్లు ఎస్పీ డాక్టర్ వినీత్ గంగన్న తెలిపారు.



ధ్రువపత్రాలను పరిశీలిస్తున్న అధికారులు

# ఎన్‌ఎంఎస్‌ఎస్‌కు ఐదుగురు విద్యార్థుల ఎంపిక



లెనీనా



జరుష



బి.నాగేష్



కార్తీక్



టి.రాజవర్ధన్

కొత్తగూడెం ఎడ్యుకేషన్, అక్టోబర్ 12: నేషనల్ మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్‌ఎంఎస్ఎస్)కు కొత్తగూడెం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ పూర్తిచేసిన ఐదుగురు విద్యార్థులు ఎంపికయ్యారు. వీరిలో జి.కార్తీక్, బి.నాగేష్, టి.రాజవర్ధన్, జరుష, లెనీనా ఉన్నారు. వీరిని పిన్సిపాల్ కత్తి రమేష్, లెక్చరర్లు ధనకొండ నరసింహారావు, గాజె సాయినాథ్, హసీనా, కారంకంటి శ్రీనివాస్, బండి వెంకటేశ్వరరావు, పవన్ అభినందించారు.

## జిన్నెలగూడెంలో వైద్య శిబిరం



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ రేణుకారెడ్డి

పర్ణశాల, అక్టోబర్ 12: మండలంలోని జిన్నెలగూడెం గ్రామంలో గురువారం వైద్య శిబిరాన్ని పర్ణశాల పీహెచ్‌సీ డాక్టర్ రేణుకారెడ్డి నిర్వహించారు. 60 మందిని పరీక్షించారు. ఆరుగురు గర్భిణులు జ్వరంతో బాధపడుతున్నట్లుగా గుర్తించి మందులు ఇచ్చారు. వ్యక్తిగత-పరిసరాల పరిశుభ్రత పాటించాలని, దోమ తెరలు వాడాలని అన్నారు. సిబ్బంది వెంకట్, నరసింహ, నాగేశ్వరరావు, భూలక్ష్మి, నలంద పాల్గొన్నారు.

దుమ్ముగూడెం, అక్టోబర్ 12: మండలంలోని లక్ష్మీనగరం గ్రామంలోగల ఏకలవ్య హాస్టల్‌లో గురువారం వైద్య శిబిరాన్ని దుమ్ముగూడెం పీహెచ్‌సీ డాక్టర్ పుల్లారెడ్డి నిర్వహించారు. ఆరుగురు జ్వర పీడితులను పరీక్షించి, రక్త పరీక్ష చేశారు. జలుబు, దగ్గుతో బాధపడుతున్న పిల్లలకు మందులు ఇచ్చారు. హెల్త్ అసిస్టెంట్ గంగాధర్ పాల్గొన్నారు.

## ఆర్టీసీ ప్రయాణికులకు లక్కీడ్రా

భద్రాచలం, అక్టోబర్ 12: దసరా పండుగ సందర్భంగా ఆర్టీసీ ప్రయాణిల కోసం లక్కీడ్రా స్కీం ప్రవేశపెట్టినట్లు భద్రాచలం డిపో మేనేజర్ రామారావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 21,22,23,28,29,30 తేదీల్లో ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించిన వారు తమ గమ్యానికి చేరుకున్న తరువాత టికెట్ వెనుక తమ పేరు, మొబైల్ నంబర్ రాసి, బస్టాండులోని డబ్బాలో వేయాలని కోరారు. లక్కీ డ్రాలో పేరు వచ్చిన వారికి రూ.10వేలు ఇవ్వనున్నట్లు తెలిపారు.

## 20న అథ్లెటిక్ చాంపియన్‌షిప్ పోటీలు

పాల్వంచ రూరల్, అక్టోబర్ 12: మండలంలోని లక్ష్మీదేవిపల్లి(ఎస్) సోషల్ వెల్ఫేర్ పాఠశాల/ కళాశాల మైదానంలో ఈ నెల 20న జిల్లా జూనియర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీలను నిర్వహించనున్నట్లు జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ కార్యదర్శి కె.మహిధర్ ఒక ప్రకటనలో తెలిపారు. రన్నింగ్, లాంగ్ జంప్, షాట్‌పుట్ తదితరాంశాల్లో అండర్-14, 16, 18, 20లో విభాగంలో బాలబాలికలకు పోటీలు ఉంటాయని వివరించారు. ప్రతిభావంతులను ఈ నెల 25న సూర్యాపేటలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు పంపుతామని పేర్కొన్నారు. పాల్గొనదలిచిన క్రీడాకారులు ఈ నెల 20న ఉదయం 8.00 గంటలకు కోచ్ నాగేందర్‌ను సంప్రదించవచ్చని సూచించారు.

## చెక్‌పోస్ట్ వద్ద నగదు సీజ్

భద్రాచలం, అక్టోబర్ 12: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో పట్టణంలో నాలుగు చెక్‌పోస్టులు ఏర్పాటయ్యాయి. బ్రిడ్జి సెంటర్‌లోని చెక్‌పోస్టును భద్రాచలం ఏఎస్పీ పరితోష్ పంకజ్ గురువారం పట్టణ సీఐ నాగరాజ్ రెడ్డితో కలిసి పరిశీలించారు. వాహన తనిఖీల్లో ఎటువంటి రసీదులు/ఆధారాలు లేని రూ.77,870ను సీజ్ చేశారు.

## జిల్లాలో రూ.8.50లక్షల నగదు పట్టివేత

కొత్తగూడెం క్రైం, అక్టోబర్ 12: ఎన్నికల కోడ్ నిబంధనలు ఉల్లంఘిస్తున్న వ్యక్తులపై పోలీసులు చట్టపరమైన చర్యలు తీసుకుంటున్నారు. ఇందులో భాగంగానే జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ గంగన్న ఆదేశాల మేరకు ప్రతి రోజు పోలీసులు వాహన తనిఖీలను ముమ్మరం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో గురువారం జిల్లా వ్యాప్తంగా పోలీస్ అధికారులు నిర్వహించిన వాహన తనిఖీల్లో భాగంగా మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ నిబంధనల ప్రకారం రూ.8.50లక్షల ఆధారాలు లేని నగదుని పట్టుకున్నారు. కొత్తగూడెం త్రీ టౌన్ పోలీసులు నిర్వహించిన తనిఖీల్లో రూ.3.68లక్షలు, అశ్వరావుపేట పోలీసులు రూ.2.22లక్షలు, దమ్మపేట పోలీసులు రూ.2.60లక్షల ధ్రువపత్రాలు లేని నగదుని సీజ్ చేశారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
Classifieds

WANTED

★రామకృష్ణ గ్రూప్ Hyd, VJA శ్రీమంతుల ఇండ్లలో వృద్ధుల సేవకు, బేబి కేర్, ఇంటి/ వంటపని చేయుటకు వర్కర్స్ కావలెను. భో|| + వ|| + జీతం: 15-22 వేలు. ఏజెంట్లకు 5000/- కమీషన్. ఫోన్: 9281452833, 9281452844.

NT-320501-All

PLOT FOR SALE



★Iconic Infra హైదరాబాద్ HMDA & DTCP లే అవుట్‌లో ప్లాట్లు విజయవాడ హైవే చౌటుప్పల్, సాగర్ హైవే యాచారం, శ్రీశైలం హైవేలలో. ఫోన్: 9154102338.

NT-310375

మాగాని పొలం అమ్మబడును

★నాయకన్ గూడెం చెర్వుకింద 5 ఎకరాల మాగాని అమ్మకానికి కలదు. హైవేకి 2వ బిట్టు Cont. No.9848773929 హైవే నుండి దారి కలదు.

NLG-310702

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.